సాక్షి విశాఖపట్నం

శనివారం । 27 । జనవరి । 2024




మోముపై మువ్వన్నెల రెపరెపలు

వివిధ వేషధారణలో విద్యార్థులు

గణతంత్రం.. అభివృద్ధి మంత్రం



జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో సీపీ రవిశంకర్, జేసీ విశ్వనాథన్

- ప్రభుత్వం వేస్తున్న ప్రతి అడుగూ ప్రజా సంక్షేమం వైపు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు
- సామాజిక, ఆర్థిక రంగాల్లో దూసుకుపోతున్న జిల్లా
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- వీఎంఆర్‌డీఏ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులు
- గణతంత్ర వేడుకల్లో జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై కలెక్టర్ మల్లికార్జున
- 513 మంది ప్రభుత్వ ఉద్యోగులకు అవార్డులు

8లో



పోలీసు బ్యారెక్స్‌లో గణతంత్ర వేడుకలు



సంగివలసలో సభా వేదిక

ఎన్నికల సమరానికి సిద్ధం



సభా ఏర్పాట్లపై చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, మంత్రులు బొత్స, అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- భీమిలి నుంచి సీఎం జగన్ ఎన్నికల శంఖారావం
- సంగివలసలో 15 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ
- 34 నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో సీఎం జగన్ మాటామంతీ
- ఉమ్మడి జిల్లాల నుంచి లక్షల్లో తరలిరానున్న ప్రజలు
- మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ చేరుకోనున్న సీఎం
- గంటన్నరపాటు నేతలతో ముఖాముఖి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగం
- సాయంత్రం 5.30కు తిరుగు పయనం

సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు సర్వం సన్నద్ధమైంది. భీమిలి నుంచి సీఎం ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల సమరానికి శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. 'సిద్ధం' పేరుతో భీమిలి నియోజకవర్గం సంగవలస గ్రామంలో 15 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. 34 అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి నాయకులు, కార్యకర్తలతో పాటు లక్షలాది మంది ప్రజలు సభకు తరలిరానున్నారు.

శనివారం సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభ జరగనుంది. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలు, గృహసారథులతో సీఎం జగన్ ముఖాముఖి ముచ్చటించనున్నారు. నియోజకవర్గాల్లో పరిస్థితులను స్వయంగా తెలుసుకోనున్నారు. అలాగే కొన్నిచోట్ల ఇన్‌చార్జ్‌లను ఎందుకు మార్చాల్సి వచ్చిందో సీఎం తెలియజేయనున్నారు. ప్రభుత్వ హయాంలో చేసిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి, తలశిల

మూడు రోజులుగా జరుగుతున్న సిద్ధం బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు పరిశీలించారు.



ముస్తాబైన వేదిక

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు గన్నవరంలో బయలుదేరి 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో సంగివలస గ్రామంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన సభాస్థలికి చేరుకుంటారు. 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం సభాస్థలి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.25 గంటలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 5.35 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

వేదిక ఇలా..

- ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సభకు తరలిరానున్నారు. దీంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు.
- అన్ని వైపుల నుంచి ప్రతి ఒక్కరికీ కనిపించేలా సభా వేదికను 80x48 అడుగుల విస్తీర్ణంలో సభా వేదిక సిద్ధం చేశారు.
- ఈ వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, పార్టీ అధ్యక్షులు ఆశీనులవుతారు.
- వేదిక ముందు నియోజకవర్గాల వారీగా 35 బ్లాకులు ఏర్పాటు చేశారు.
- వేదిక నుంచి బ్లాకుల వరకు టీ ఆకారంలో ర్యాంపు సిద్ధం చేశారు. దీనిని జాతీయ రహదారి వైపు 350 అడుగులు, కుడి, ఎడమల వైపు చెరో 75 అడుగుల మేర నిర్మిస్తున్నారు.
- వేదిక చుట్టూ 'సిద్ధం' పేరుతో ఫ్లెక్సీలు కట్టి బెలూన్లు ఏర్పాటు చేస్తున్నారు. భీమిలి మొత్తం వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలతో కళకళలాడుతోంది.
- సీఎం జగన్ ఈ ర్యాంపు మీదుగా నడిచి ఆయా నియోజకవర్గాల నాయకులతో మాట్లాడుతారు.
- సభ జరుగుతున్న చుట్టుపక్కల ప్రదేశాలు బంగ్లా మెట్ట, సంగివలస, ఆదర్శనగర్, చెరకుపల్లి ఇలా పలు ప్రాంతాల్లో 30 ఎకరాలలో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.
- సభను ఆనుకొని అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల అవుట్‌గేట్‌కు ఎదురుగా 6 ఎకరాల విస్తీర్ణంలో హెలిప్యాడ్ నిర్మించారు.
- శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు సంబంధించి ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.

భారీ భద్రతా చర్యలు : సీఎం జగన్ సభకు పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. సభ వేదిక వద్ద బందోబస్తుతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, రక్షణ చర్యలకు సుమారు 3 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఇప్పటికే సభా స్థలిలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. సభ వేదికకు సమీపంలో ఉన్న బిల్డింగ్‌లు, అపార్ట్‌మెంట్లపై ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి నిరంతర నిఘా పెడుతున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వెస్ట్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి శుక్రవారం విమానాశ్రయంలో సిబ్బంది పలు సూచనలు చేశారు.



సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్



హోర్డింగ్‌లతో స్వాగతం

సభా ప్రాంగణం కళకళ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభతో ఆ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. సభా వేదిక పరిసర ప్రాంతాల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లోనే కాకుండా ప్రైవేటు ప్రాంతాల్లో కూడా ఉన్న తుప్పలు, డెబ్రిస్ తొలగించారు. గ్రావెల్‌తో ఆ ప్రాంతాన్ని చదును చేశారు. కొత్తగా వీధిదీపాలు ఏర్పాటు చేశారు. డివైడర్లు, అండర్‌పాస్ రహదారులకు ఇరువైపులా రంగులు వేశారు. హెలిప్యాడ్ నుంచి సభ జరిగే వేదిక చుట్టూ డ్రైనేజీలు, రహదారులు నిర్మించారు.



వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా మళ్ల



విశాఖ సిటీ: వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా మళ్ల విజయప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఆయన నియామకాన్ని ప్రకటించింది. మళ్ల విజయప్రసాద్ 2009లో పశ్చిమ నియోజకవర్గ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పార్టీలో పలు పదవుల్లో పనిచేశారు. 2019 ఎన్నికల తరువాత ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్‌గా వ్యవహరించారు. తాజాగా ఆయనకు కీలకమైన విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడిగా పార్టీ అధినాయకత్వం నియమించింది.

జీవీఎంసీలో జోనల్ కమిషనర్లు, పలువురు అధికారుల బదిలీ

డాబాగార్డెన్స్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలో భాగంగా జీవీఎంసీ పరిధిలో గల పలువురు జోనల్ కమిషనర్లు, అధికారులను కూడా బదిలీ చేశారు. బొబ్బిలి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సత్తార్ శ్రీనివాసరావును జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)గా బదిలీ చేశారు. జీవీఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్.రామలక్ష్మిని బొబ్బిలి మున్సిపల్ కమిషనర్‌గా, జోనల్ కమిషనర్ బి.రామును మండపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పీవీవీడీ ప్రసాదరావును జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా, జీవీఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.చంద్రికను రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ సెక్రటరీ జి.శైలజావల్లిని జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా నియమించారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణను సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా, అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.ఐవీఐ నాయుడును జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీ కె.హేమావతిని జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ పి.సింహాచలంను పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్‌గా, మంగళగిరి మెప్మా అసిస్టెంట్ డైరెక్టర్ కె.మేరీగోల్డ్ డైమండ్‌ను జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మిని జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా, జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్ బి.సన్యాసినాయుడును జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ప్రగతి పతాకం రెపరెపలు



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

- ప్రభుత్వం వేస్తున్న ప్రతి అడుగూ ప్రజా సంక్షేమం వైపు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు
- సామాజిక, ఆర్థిక రంగాల్లో దూసుకుపోతున్న జిల్లా
- గణతంత్ర వేడుకల్లో జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై కలెక్టర్ మల్లికార్జున



సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట : భారత రాజ్యాంగానికి ఆమోదం తెలిపిన వేళను గుర్తు చేసుకుంటూ శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవం.. జిల్లా వ్యాప్తంగా అంబరాన్నింటింది. గర్వంతో నీలాకాశాన ఆవిష్కృతమైన మువ్వన్నెల జెండాను చూసి మురిసిపోయిన నగరం.. పోలీస్ బ్యారెక్స్ మైదానం రిపబ్లిక్ డే వేడుకలతో పరవశించిపోయింది. కలెక్టర్ ఎ. మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ-1 కె.శ్రీనివాసరావుతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పరేడ్ కమాండర్ బృందం కవాతు నిర్వహించి కలెక్టర్‌కు గౌరవ వందనం సమర్పించారు. పరేడ్ వాహనంలో సీపీతో కలిసి కవాతును సమీక్షించారు. ఉత్తమ సేవలందించిన 513 మంది జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను అమలు చేయడం ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమైందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరవేసేందుకు కృషి చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి మల్లికార్జున వివరించారు.

- జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో 468 ఆరోగ్య శిబిరాలు నిర్వహించి 2,02,670 మంది ఓపీ చికిత్స చేసి 2,565 మందిని డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశాం. రెండో విడతలో ఇప్పటి వరకూ 31,600 మందికి చికిత్స అందించాం
- గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పు చేయించుకున్న 13,354 మందికి జననీ సురక్ష యోజన కింద రూ.1.34 కోట్లు అందజేశాం.
- డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఏడాది కాలంలో 98,664 మందికి రూ.216 కోట్ల ఖర్చుతో వివిధ శస్త్రచికిత్సలు నిర్వహించాం.
- రూ.19.80 కోట్లతో మెంటల్ కేర్ ఆస్పత్రిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, విమ్స్‌లో రూ.20 కోట్లతో సిటీ డయాగ్నోసిస్ సెంటర్, రీజనల్ డ్రగ్ స్టోర్, రూ.2.93 కోట్లతో డ్రగ్ కంట్రోల్ పరిపాలన భవన నిర్మాణాలు సిద్ధమవుతున్నాయి.
- విమ్స్‌లో ఆయుష్ యోగా, రూ. మం రూ.14.85 కోట్లతో 50 పడకల ఆస్పత్రి, రూ.16.4 కోట్లతో నేచురోపతి కాలేజీ, కొంత్యాంలో 6.67 కోట్లతో ఆయుర్వేదం ఫార్మసీ, దుల పరీక్ష కేంద్ర నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.
- కేజీహెచ్‌లో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.
- నాడు-నేడు ఫేజ్-1 కింద రూ.2.14 కోట్లతో 13 అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- జగనన్న అమ్మఒడిలో భాగంగా 2 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నాలుగు విడతల్లో రూ.1,114 కోట్లు జమ చేశాం.
- నాడు-నేడు ఫేజ్-2లో 309 పాఠశాలల్లో రూ.177 కోట్లతో అదనపు మౌలిక వసతులు కల్పన పనులు జరుగుతున్నాయి.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



ప్రజాప్రతినిధులను పలకరిస్తున్న కలెక్టర్

- 8వ తరగతి చదువుతున్న 10,526 మందికి రూ.73.48కోట్లతో బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశాం.
- వైఎస్సార్ రైతు భరోసా కింద 27,955 మంది రైతులకు రూ.21 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.11.81 కోట్లు మంజూరు చేశాం.
- ఈ ఏడాది 732 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు 89 మందికి రూ.51 లక్షలు పంట రుణాలు అందజేశాం.
- 2023-24 సంవత్సరంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా 12,173 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున రూ.12.173 కోట్లు పంపిణీ చేశాం. రూ.179 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ పనులు పురోగతిలో ఉన్నాయి.
- 9 నెలల కాలంలో జిల్లాలో 1,66,829 మంది పింఛన్‌దారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక కింద రూ.413 కోట్లు పంపిణీ చేశాం.
- బ్యాంకు లింకేజీల ద్వారా 2023-24కి 12,406 పొదుపు సంఘాలకు రూ.967 కోట్ల రుణ సదుపాయం కల్పించాం. ఆసరా పథకం కింద 4వ విడతగా రూ.177.52 కోట్ల రుణమాఫీ జరిగింది.
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద గతేడాది 31,495 ఎస్‌హెచ్‌జీలకు రూ.52 కోట్లు మంజూరు చేశాం.
- జగనన్న తోడు పథకం ద్వారా 48,472 మంది లబ్ధిదారులకు రూ.48.47 కోట్లు చిరువ్యాపారులు, వీధి వర్తకులకు రుణం మంజూరు చేశాం.
- జగనన్న విద్యా దీవెన కింద 4,486 మందికి రూ.11.75 కోట్లు, వసతి దీవెన కింద 4,238 మందికి రూ.3.95 కోట్లు మంజూరు చేశాం.
- షెడ్యూల్ కులాల ఇళ్లకు ఉచిత విద్యుత్ పథకం కింద రూ.368 కోట్లు ఖర్చు చేశాం.
- ఈ ఏడాది కొత్తగా 3,024 రైస్‌కార్డులు మంజూరు చేశాం.
- పేదలందరికీ ఇళ్లలో భాగంగా జీవీఎంసీ, రూరల్ ప్రాంతాల ప్రజలకు పట్టణంలో 59, రూరల్‌లో 138 లేఔట్లలతో 1.31 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి ఇంటికీ రూ.180 లక్షల పూర్తి సబ్సిడీతో రూ.2,357 కోట్ల గ్రాంట్ కేటాయించింది. ఇప్పటికే 12 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.175 కోట్ల వ్యయంతో 4,828 ఎకరాల భూమిని అభివృద్ధి చేసి 1,41,654 ప్లాట్లు అందజేశాం.
- రూ.1938 కోట్ల పెట్టుబడితో జిల్లాలో 18,060 ఎంఎస్ఎంఈలు స్థాపించి 1,95,746 మందికి ఉపాధి కల్పించాం. రూ.42,684 కోట్ల పెట్టుబడితో 60 వేల మందికి ఉపాధి అందించే 3 భారీ పరిశ్రమలు జిల్లాకు రానున్నాయి.
- వైఎస్సార్ వాహన మిత్ర పథకంలో భాగంగా ఈ ఏడాది 21,134 మంది లబ్ధిదారులకు రూ.21.13 కోట్ల ఆర్థిక సహాయం అందజేశాం.
- వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా రూ.50 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం చేపట్టాం.
- వీఎంఆర్డీఏ పార్క్ వద్ద ప్రత్యేక ఆకర్షణగా రూ.8 కోట్లతో ఓషియన్ డెక్ నిర్మిస్తున్నాం. తెన్నేటి పార్క్ వద్ద రూ.కోటితో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ప్రాజెక్టు పనులు చేపట్టాం.
- రూ.5 కోట్లతో కైలాసగిరిపై జిప్‌లైన్, స్కై సైక్లింగ్, గ్లాస్ స్కై వాక్ బ్రిడ్జ్, ఫ్లాష్ టవర్ తదితర అడ్వెంచర్ స్పోర్ట్స్ రాబోతున్నాయి. పీపీపీ ప్రాతిపదికన కైలాసగిరిపై రూ.18 కోట్లతో నేచర్ కాటేజీ, రివాల్వింగ్ రెస్టారెంట్ నిర్మించనున్నాం.
- 2023-24లో జీవీఎంసీ పరిధిలో 989 పనులను రూ.207.79 కోట్లతో చేపట్టగా ఇందులో 342 పనులు పూర్తయ్యాయి. నగర పరిధిలో రూ.140 కోట్లతో 25 ప్రధాన రోడ్లను విస్తరించాం.

పాల్గొన్న ప్రముఖులు: ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ , జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, రాష్ట్ర పన్నుల శాఖ జేసీ ఒ.ఆనంద్, వుడా సెక్రటరీ దాట్ల కీర్తి, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఎస్‌వో సూర్యప్రకాష్, కార్పొరేటర్ శశికళ పాల్గొన్నారు.



భారత మాతకు జేజేలు..

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ సమైక్యతను చాటి చెప్పాయి. నడుపూరు హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన దేశం కోసం జీవిద్దాం స్వాగత నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థులు వందేమాతరం గీతానికి చేసిన నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకుంది. దేశం మన దేరా గీతానికి కణితి హైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వ క్వీన్ మేరీ హైస్కూల్ విద్యార్థులు తేనెల తేనెల మాటలతో, ఆనందపురం కె.జి.బి.వి విద్యార్థులు ఓం ఒకే ఒకే దేశం గీతానికి చేసిన జానపద నృత్యాలు అదరహో అనిపించాయి. బాలభవన్ స్కూల్ విద్యార్థులు బాలలం మేము బాలలం, ఎస్‌హెచ్ ఎయిడెడ్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇది మన భారతం గీతానికి చేసిన నృత్యాలు జాతీయ సమైక్యతకు దర్పణంగా నిలిచాయి. సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన కళాకారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు.




మొదటి స్థానం : జీవీఎంసీ శకటం, జ్ఞాపిక అందుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ




రెండో స్థానం: వీఎంఆర్డీఏ శకటం, జ్ఞాపిక అందుకుంటున్న వీఎంఆర్డీఏ అధికారులు

ప్రత్యేక ఆకర్షణగా శకటాలు

జీవీఎంసీ శకటానికి ప్రథమస్థానం

వేడుకల్లో భాగంగా 14 శాఖలు తొమ్మిది శకటాలను ప్రదర్శించాయి. జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పాఠశాల విద్య, పౌర సరఫరాలు శాఖ, డీఆర్డీఏ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, గృహ నిర్మాణం, వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను కళ్లకు కట్టినట్లు చూపించాయి. ఇందులో జీవీఎంసీ శకటం ప్రథమ స్థానం దక్కించుకుంది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో వీఎంఆర్డీఏ, పాఠశాల విద్య శకటాలు నిలిచాయి. గృహ నిర్మాణ శాఖ శకటం ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. విజేతలుగా ఎంపికైన శాఖల అధికారులకు కలెక్టర్ జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు.



మూడోస్థానం: విద్యాశాఖ శకటం



ప్రత్యేక బహుమతి: గృహ నిర్మాణ శాఖ శకటం

ఉత్తమ సేవలకు పురస్కారాలు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన 513 మంది జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, పలు సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు.

– సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట



కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్వో మోహన్‌కుమార్, అడిషనల్ డీసీపీ రామకృష్ణంరాజు, ద్వారక క్రైం సీఐ ఇమ్మానియేల్ రాజు, ఏసీపీ వెంకటరావు



ట్రాఫిక్ సీఐ రేవతమ్మ, సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి, జిల్లా సహకార అధికారి ప్రవీణ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్, డీపీవో ఎంవీఏ శ్రీనివాసరావు



పీసీబీ పొల్యూషన్ ఇంజినీర్ నాగిరెడ్డి, జిల్లా స్టాంపులు,రిజిస్ట్రేషన్ అధికారి సృజన, ఆర్అండ్ బీ ఎస్ఈ కాంతిమతి, స్పోర్ట్స్ చీఫ్ కోచ్ జాన్ గాలియట్, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యరావు, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ డి.ఎ.నాయుడు, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్



స్టీల్‌ప్లాంట్ ఎస్డీసీ రామ్మోహనరావు, వీఎంఆర్డీఏ కార్యదర్శి కీర్తి. ఎస్డీసీ(జాతీయ రహదారి) అఖిల. మార్కెటింగ్ శాఖ సీనియర్ సహాయకుడు నాగేశ్వరరావు, వీఆర్వో షేక్ ఖాదర్ బాబా, డీఎంహెచ్‌వో పీఏ నాగభూషణం, రైతునేస్తం పురస్కార గ్రహీత బంగారు రూన్సీ. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ



రెవెన్యూ సీనియర్ సహాయకుడు బుంగా సుధాకర్, డీసీసీబీ మేనేజర్ శ్రీనివాసరాజు ,జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ రవికృష్ణరాజు, అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

ఉప్పొంగిన జాతీయభావం

బీచ్‌రోడ్డు: మూడు వేల మంది యువతీ యువకులు 400 మీటర్ల జాతీయ జెండాతో తీరం మొత్తం తిరుగుతూ దేశ భక్తిని చాటుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో శుక్రవారం కలర్స్ వాక్ పేరుతో జాతీయ జెండా ర్యాలీ అబ్బురపరిచింది. అనంతరం జాతీయ గీతాలకు యువతీయువకులు నృత్యం చేసి అలరించారు. జీవీఎల్ దంపతులు కూడా నృత్యం చేసి ఉత్తేజపరిచారు. వేడుకల్లో భాగంగా మాజీ సైనికులకు ఘనంగా సత్కరించారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్‌తో విన్యాసాలు ప్రదర్శించింది. రెండు గస్తీ నౌకలు విద్యుత్ కాంతులతో ప్రేక్షకులను అలరించాయి. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో తీరంలో ర్యాలీ చేస్తున్న యువత

